## భారీ ఆఫర్‌కు నో చెప్పిన బన్నీ!



అగ్రహీరో అల్లు అర్జున్ 'పుష్ప-2' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. 'పుష్ప'కి పూర్తి భిన్నంగా ఇందులో కేరక్టరైజేషన్ ఉంటుందని తెలుస్తున్నది. తొలి భాగానికి జాతీయ ఉత్తమనటుడిగా అవార్డు రావడంతో, ఈ మలిభాగంపై దర్శకుడు సుకుమార్ ప్రత్యేకదృష్టి పెట్టారు. ప్రేక్షకుల ఊహలకు అందని ట్విస్ట్ ఈ కథలో ఉంటుందని చిత్రబృందం తెలియజేస్తున్నది. ఆగస్ట్ 15న ఈ చిత్రం విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ సినిమా తర్వాత త్రివిక్రమ్ సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు బన్నీ. ఇదిలావుంటే. ఇటీవల ఓ పాపులర్ లిక్కర్ బ్రాండ్‌కు సంబంధించిన వ్యాపార ప్రకటనలో నటింపజేయడానికి సదరు సంస్థ వారు బన్నీని కలవడం జరిగింది. ఆ యాడ్‌ఫిలింలో నటించినందుకు గాను వాళ్లు బన్నీకి 10కోట్లు ఆఫర్ చేశారు. అయితే, బన్నీ వారి ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించారట. యువతరానికి ఆదర్శంగా ఉండాల్సిన తాను ఇలాంటి ప్రకటనల్లో నటించడం సబబుకాదని వారితో బన్నీ చెప్పినట్టు విశ్వసనీయ సమాచారం. నమ్మిన సిద్ధాంతంకోసం కోట్ల రూపాయల ఆఫర్‌ని కూడా వదులుకున్న బన్నీకి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.



రాజమౌళి, ప్రశాంత్‌నీల్, పృథ్వీరాజ్, ప్రభాస్, నవీన్ యెర్నేని, విజయ్ కిరంగదూర్

## 'సలార్' టికెట్ కొనుగోలు చేసిన రాజమౌళి

అగ్ర హీరో ప్రభాస్ తాజా చిత్రం 'సలార్' పై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో హోంబలే ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదలకానుంది. ఈ చిత్రాన్ని నైజాం ఏరియాలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ విడుదల చేస్తున్నది. ఈ సందర్భంగా ఫస్ట్ టికెట్‌ను అగ్ర దర్శకుడు రాజమౌళి కొనుగోలు చేశారు. ఈ ఫోటోను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ట్విట్టర్‌లో షేర్ చేసింది. 'భారతదేశం గర్వించదగ్గ దర్శకుడు రాజమౌళి ఫస్ట్ టికెట్‌ను కొనుగోలు చేయడం ఆనందంగా ఉంది. నైజాంలో ఈ సినిమాకు గ్రాండ్ ఓపెనింగ్స్ లభిస్తాయన్న నమ్మకం ఉంది' అని ట్విట్టర్‌లో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ పేర్కొంది. ఈ ఫొటోలో రాజమౌళితో పాటు నిర్మాత నవీన్ యెర్నేని, పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రశాంత్‌నీల్, హోంబలే ఫిల్మ్స్ విజయ్ కిరంగదూర్ ఉన్నారు. 'సలార్' చిత్రాన్ని నైజాంలో రికార్డు స్థాయి థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ప్రకటించింది.

## రూమర్స్‌కు చెక్!

బాలీవుడ్‌లో అన్యోన్య దంపతులుగా పేరు తెచ్చుకున్నారు అభిషేక్ బచ్చన్-ఐశ్వర్యరాయ్. దాదాపు 17 ఏండ్ల సుదీర్ఘ వైవాహిక బంధంలో వీరి మధ్య విభేదాలు తలెత్తిన దాఖలాలు లేవు. అయితే ఈ జంట విడిపోనున్నారంటూ గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వార్తలు ప్రచారమవుతున్నాయి. కొద్ది రోజుల క్రితం అమితాబ్‌బచ్చన్ 'అంతా అయిపోయింది' అనే అర్థం వచ్చేలా చేసిన ట్వీట్ అభిషేక్ బచ్చన్ దంపతులు విడాకుల రూమర్స్‌కు ఆజ్యం పోసింది. ఐశ్వర్యరాయ్ సోషల్ మీడియా ఖాతాలను అమితాబ్ అన్‌ఫాలో చేశారని మీడియాలో కథనాలొచ్చాయి. ఈ నేపథ్యంలో అభిషేక్-ఐశ్వర్యరాయ్ విడాకులు తీసుకోబోతున్నారంటూ జోరుగా ప్రచారం జరుగుతున్నది. ఈ రూమర్స్ అన్నింటికి తన తాజా వీడియోతో చెక్ పెట్టింది ఐశ్వర్యరాయ్. ముంబయిలో జరిగిన ఓ స్కూల్ వార్షికోత్సవ వేడుకలో అమితాబ్‌బచ్చన్, అభిషేక్, ఐశ్వర్యరాయ్ కలిసి పాల్గొన్నారు. ముగ్గురూ సరదాగా నవ్వుతూ కనిపించారు. ఇదే ఈవెంట్‌లో అమితాబ్‌బచ్చన్ ఫ్యామిలీ అంతా కలిసి స్టేజీ మీద నృత్యం చేశారు. దీంతో విడాకుల రూమర్స్‌కు చెక్ పడినట్లయిందని అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.




బాలరాజ్, నాగార్జున, చైతన్య రావు, బాలరాజశేఖరుని

## రొమాంటిక్ హనీమూన్

'దర్శకుడు బాల మా అన్నపూర్ణ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌కి డీన్. హాలీవుడ్ సినీనిర్మాణ పరిజ్ఞానాన్ని మా విద్యార్థులకు పంచి ఇవ్వడమేకాక, మా విద్యార్థులకు, అధ్యాపకులకూ 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్' చిత్రంలో అవకాశాలు ఇచ్చాడు. వినోదంతోపాటు ఈ కథలో చక్కని సందేశంకూడా ఉంటుంది. కల్యాణీమాలిక్ రొమాంటిక్ సంగీతాన్నిచ్చాడు. ఈ సినిమా మంచి విజయం సాధించాలి' అని అక్కినేని నాగార్జున అన్నారు. చైతన్యరావు, హెబ్బాపటేల్ జంటగా రూపొందిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. బాలరాజశేఖరుని దర్శకుడు. కె.కె.ఆర్, బాలరాజ్ నిర్మాతలు. ఈ చిత్రం తొలి పోస్టర్‌ని అగ్రహీరో అక్కినేని నాగార్జున విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హాలీవుడ్‌లో పనిచేసిన తనకు తెలుగు సినిమా చేయడం కల అని, నాగార్జున దంపతుల ప్రోద్బలంతో తెలుగు సినిమా చేయగలిగానని దర్శకుడు చెప్పారు. త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు తెలిపారు. తనికెళ్లభరణి, సుహాసిని, అలీ, సురేఖవాణి తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి నేపథ్య సంగీతం: ఆర్.పి.పట్నాయక్, కెమెరా: శిష్టా వి.ఎం.కె.

## నేను గుడ్ యాక్టర్‌ని.. గ్రేట్ రైటర్‌ని.. బ్యాడ్ డైరెక్టర్‌ని


అడివి శేష్

'ఈ ఏడాది నా సినిమాలేవీ విడుదల కాలేదనే బాధ నాకులేదు. పేస్ బౌలర్లందరికీ ఒకే స్పీడ్ ఉండదు. మనిషన్నాక ఎవరి స్పీడ్ వాళ్లకుంటుంది. ఈ ఏడాదంతా స్క్రిప్ట్ వర్క్‌కే సరిపోయింది. గత ఏడాది మేజర్, హిట్-2 సినిమాలు విడుదలై విజయం సాధించాయి. వచ్చే ఏడాది అలాగే రెండు విడుదలవుతాయి' అని అడవిశేషు చెప్పారు. నేడు ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో ముచ్చటించారు. ప్రస్తుతం చేస్తున్న 'జీ2' అయిదుదేశాల్లో జరిగే కథని, యూనివర్సల్ సబ్జెక్ట్ కాబట్టే పాన్ ఇండియా సినిమాగా రూపొందిస్తున్నామని, అలాగే శృతిహాసన్‌తో చేస్తున్న సినిమా కూడా హిందీ, తెలుగు భాషల్లో వేరువేరుగా షూట్ చేస్తున్నామని, నటీనటులను కూడా తెలుగు, హిందీ భాషల్లో పట్టున్నవాళ్లనే తీసుకుంటున్నామని అడివిశేషు చెప్పారు. ఇంకా చెబుతూ 'నేను గుడ్ యాక్టర్, గ్రేట్ రైటర్, బ్యాచ్ డైరెక్టర్ అని ఫీలవుతా. దర్శకుడికి ఓర్పు అవసరం. అది నాకు లేదు. అందుకే నేను యాక్టింగ్, రైటింగ్ ప్రిఫర్ చేస్తా. అది కూడా కేవలం నాకోసం. ఇప్పుడు చేస్తున్న సినిమాలు పూర్తయ్యాక, కేవలం నటుడిగానే మరో రెండు సినిమాలు చేయబోతున్నాను' అని చెప్పారు అడివిశేషు. శృతిహాసన్‌తో చేసే సినిమా వెరీ ఇంటెన్స్ యాక్షన్ లవ్‌స్టోరీ అని, హైలీ ఎమోషనల్ న్యూజానర్ ఫిలిం అని, దర్శకుడు షానీల్ డియో అద్భుతమైన ప్రతిభావంతుడని, 'క్షణం' చేస్తున్న సమయంలో తను చేసిన షార్ట్‌ఫిలిం కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఎంపికైందని తెలిసి షాక్ అయ్యానని, ఎలాగైనా అతడ్ని డైరెక్టర్‌గా పరిచయం చేయాలనే నా ఆకాంక్ష నెరవేరుతున్నందుకు ఆనందంగా ఉందని అడివి శేషు చెప్పారు.

## గ్రామీణ ప్రేమాయణం



అనురాగ్, అవికా గోర్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఉమాపతి'. క్రిషి క్రియేషన్స్ పతాకంపై సత్యం ద్వారంపూడి దర్శకత్వంలో కె.కోటేశ్వరరావు నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. అందమైన గ్రామీణ నేపథ్యంలో టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది. రెండు గ్రామాల మధ్య గొడవలు నాయకానాయికల ప్రేమకు అడ్డుగోడలా నిలిచే సన్నివేశాలతో టీజర్ ఆసక్తికరంగా సాగింది. కుటుంబ సమేతంగా చూడాల్సిన చిత్రమిదని, సహజత్వం ఉట్టిపడే గ్రామీణ ప్రేమకథగా ప్రతి ఒక్కరిని అలరిస్తుందని దర్శకుడు తెలిపారు. పోసాని కృష్ణమురళి, తులసి, ప్రవీణ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రాఘవేంద్ర, సంగీతం: శక్తికాంత్ కార్తిక్, దర్శకత్వం: సత్యం ద్వారపూడి.


రాశీఖన్నా

## అక్కడ సక్సెస్ గురించి ఆలోచించరు

'ఊహలు గుసగుసలాడే'తో హీరోయిన్‌గా పరిచయమై 'జిల్'తో కమర్షియల్ హీరోయిన్‌గా ఎదిగి టాలీవుడ్ క్రేజీ హీరోయిన్స్‌లో ఒకరిగా ఎదిగింది రాశీఖన్నా. అయితే, ఈ మధ్య తాను నటించిన సినిమాలు పెద్దగా ఆడకపోవడం వల్లే అనుకుంట.. తమిళబాట పట్టిందీ ఢిల్లీ బ్యూటీ. అక్కడ అవకాశాలను బాగానే రాబట్టుకుంటున్నది. ప్రస్తుతం ఈ అమ్మడి చేతిలో ఓ మూడ్నాలుగు తమిళ సినిమాలున్నాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తమిళ పరిశ్రమపై ఆసక్తికరంగా మాట్లాడింది రాశీఖన్నా ' 'తమిళ పరిశ్రమలో ఫస్ట్ ప్రయారిటీ టాలెంట్‌కి ఇస్తారు. సెకండ్ ప్రయారిటీ అందానికిస్తారు. కేరక్టర్‌కి కరెక్ట్ అనుకుంటే సక్సెస్ గురించి కూడా ఆలోచించరు. దేశంలోని మిగతా పరిశ్రమలతో పోలిస్తే ఇది చాలా భిన్నమైన పరిశ్రమ అని చెప్పాలి. నాకు లైఫ్ ఇచ్చింది తెలుగు సినిమా అయితే, నటిగా నా ఆకలి తీరుస్తుంది మాత్రం తమిళ సినిమానే. ఇక్కడ మంచి పాత్రలు దొరుకుతున్నాయి.' అంటూ ఆనందం వ్యక్తం చేసింది రాశీఖన్నా.


భాగ్యశ్రీ

## రవితేజకు జోడీగా..

రవితేజ కథానాయకుడిగా హరీశ్‌శంకర్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రంలో కథానాయికగా బాలీవుడ్ భామ భాగ్యశ్రీ బోర్సే ఖరారైంది. ఈ సందర్భంగా శనివారం విడుదల చేసిన పోస్టర్‌లో ఈ భామ సంప్రదాయ పరికిణీ ఓణీలో అందంగా కనిపిస్తున్నది. 'హరీశ్‌శంకర్ సినిమాల్లో కథానాయికల పాత్రలకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. ఈ చిత్రంలో కూడా నాయకానాయికల మధ్య వచ్చే సన్నివేశాలు ప్రేక్షకుల్ని అలరిస్తాయి. రవితేజ-హరీష్‌శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న మూడో చిత్రమిది. తప్పకుండా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది' అని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో తెలియజేయనున్నారు. ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాత: టీజీ విశ్వప్రసాద్, రచన-దర్శకత్వం: హరీశ్‌శంకర్.


